మాతృ నిర్వేదము

నీలంరాజు వేంకటశేషయ్య గారు

౧

తనయుడు రెండేండ్ల ప్రాయముననుండ భర్త గతించెను. "కష్టములెన్నడును ఒంటిగ రావు." భర్తృమరణముతో భాగ్యలక్ష్మియు తఱలెను. పతి బ్రతికియున్నంత కాలమును బంధువర్గ మెడబాయకుండిరి. సంపన్న గృహస్థులై యుండునంతవరకు సన్నిహితబంధువులని తలంచినవారెల్లరు భర్తృమరణానంతరము జలమింకను తటాకమందలి కప్పలవలె కనుమరగువారైరి. కాలమా! కాటకముల కాలవాలము. ధనధాన్యములా! పూట కూటికిచేత చిల్లిగవ్వ యైనను లేనపుడు మాట యేల? ఒకటి రెండు జీవములు బ్రతుకవలెను జీవనమా! దుస్సహము. అటులని ఈదేహయాత్ర నింతటితో ముగించి ఆత్మత్యాగము గావింపనా? ఆ...ఆ ...ఎటులు! ఆ-త్మ-త్యా-గ-మా? సాధ్యమా? సాధ్యమే యైనను ధర్మమా?"

దరిదాపుగాని, నిలువనీడగాని 'నా'యను వారుగాని లేక తనమృదుబాహువుల దండను దినదినప్రవర్ధమానుడగు ఆ రెక్కలు రాని పక్కిని యనాథ నీ దిక్కుమాలిన ప్రపంచమున, ఈయగాధకూపమున, కఠినకర్కశశిలాహృదయయగు నీప్రకృతి గర్భమున విసరివేయుటయే! అగుచో ధర్మచ్యుతి గలుగదా? గతులు దప్పవా? కాన, బ్రతుకుట- ఎటులో- బ్రతుకుట కర్తవ్యము. మరల జీవనసమస్య. ఉన్నత కులశీలవంశాదులం గలిగి గౌరవాధిక్యముగల కుటుంబమునకు జేరినదియై సదాచారసంపత్తిచే వన్నెకెక్కిన ఆయూపన్న. కానికాలమందు పడరానియిడుమల గుడుచుచున్నను పతి మృతుడైటచే పల్వెతలపాలైనను ఎటులో బ్రతుకుట కంగీకరించునా? బ్రతికిచెడెగాని చెడిబ్రతుక లేదు. ఇక భావ్యర్థమేమి? మనస్సాక్షికి విరుద్ధముగా నట్టిఆత్మగౌరవమునకు హానిగలుగనిపని నెద్దానినైనచేయక తప్పదు. కాయకష్టముచేసి జీవించుటకు కృతనిశ్చయు రాలాయెను.

పతివియోగదుఃఖ మొకవంకను, పసిపాపనిపోషణభారము వేరొకవంకను క్రుంగదీయుచున్నను, ఆదీనురాలిజీవములు నిలుచుట కాపసికూనయే ఆధారమాయెను. విని ర్మలశాంత్యాకాశపథమం దాయమ కాచిన్నికుఱ్ఱడే నక్షత్రకాంతి. గంభీరజలధిమధ్యమున ఆనిసువొక్కడే తన కాశ్రయ మగు తెప్ప. సర్వదా ఆతనిదివ్యసుందరమూర్తిని తనివిదీర వీక్షించుటచే కృశించిపోవుచున్న ఆయమమానసారామమందలి యాశాలతలు

క్రమక్రమమున చిగురింప ఆనిర్భాగ్యురా లెట్టెటులో కష్టములకు కనులు మూసి, ఆరు సంవత్సరములు వెడలబుచ్చెను. దినమంతయు చెమట లూడ్చి, కష్టించి గృహమున కరు దేరగనే, మనఃఫలకమందు నిచ్చలును ముద్రితమైయుండు జగన్మోహనలావణ్యస్వ రూపము, నేత్రానందకరముగ గోచరమగు నంతనే "అమ్మా!" యను అవ్యక్తమ్మదు మధురాలాపము చెవిని బడినంతనే సర్వకష్ట ములను మరచి అవ్యయానంద మనుభవించు చుండెను. తా నెవనికొరకై తనమేనప్రాణ ములు బిగబట్టి దుర్భరజీవితమును గడుప సంకల్పము గావించుకొనియెనో, ఆతనికోమల స్వరము వినుటకంటె, తన్మనోహరమూర్తిని సర్వదాసందర్శించుటకంటెను, తనివారనాతనికి పరిచర్య సల్పుటకంటెను, కోరదగినది మరెద్ది యైన గలదా!

౨

ఆనాటి సాయంసమయమున గగనమండ లము నిర్మలమైపడుమరదెసయందుమాత్రము అర్ధచంద్రాకృతిని తరుణారుణకాంతులావరించి యుండెను. మరీచిమాలిని యగు లోకబాంధ వుడు దినకృత్యములను నిర్వర్తించి తన నెల వున కరుగుచుండెను. తాము సేకరించిన ఆహా రమును ముక్కులం దిడుకొని విహంగపంక్తులు ఎడతెగక బారులుతీర్చి తమతమ కులాయము లకుజనుచుండెను. మన యనాథవనితయు తన జీర్ణపటకుటీరద్వారమును జేరెను. కాని అహే తుకముగ నాయమ మానసమంతయు ఆనాడు కల్చిన్నట్లుండెను. హృదయ మతి త్వరితగతిని కొట్టుకొనదొడంగెను. తనువేలకో కంపింప మొదలిడెను. ఆపాదమస్తకము ముచ్చెమటలు గ్రమ్మసాగెను. అప్రయత్నముగ నామె పెద వులనుండి యొక వేడినిట్టూర్పు బయల్పడెను. కారణములేని యీచిహ్నము లేలనో ఎవని కెరుక? ముందు రానున్న సంఘటనముల కిది సూచనయా? చూతము.

మోహనచంద్రుడు చినిగియున్న చాప పై నిశ్శబ్దముగ బోరగిలిపరుండియుండెను. తల్లి ద్వారముకొద్దకువచ్చి నిలచెను. మోహనుడు వదనమునెత్తి తనదృష్టి నొకపరి తల్లివంకకు మరల్చెను. వెంటనే తిరిగి తనచూడ్కులను పసంహరించుకొనియెను. కాని ఎప్పటివలె తల్లిని కౌగిలించుకొనుటకై పరుగుపరుగున బోలేదు. "అమ్మా!" యని పిలువలేదు. మంద హాససుందరవదనమును జూపలేదు. పాప మా యువిద గుండియలు ఝల్లుమనియెను. అత్యా తురతతో "మోహనా! నాతండ్రీ!" యని ఎలుగెత్తి యామె పలుకరించెను. పిలుపుతో నైనను బాలుడు తనచెంతకువచ్చునని యా శించెను. కాని భగ్నాశయయ్యెను. అడుగులు తడబడుచుండ ఆతనిదరి జేరెను. ఆత డేడ్చు చుండెను. బోరగిలబడియున్న తనయుని లేవ నెత్తి, తనచీరెకొంగుచే కనులనుండి స్రవించు బాష్ప ధారల తుడిచి, చిందరవందర లైన ముంగురులను తనయంగుళులతో సరి చేసి, బుజ్జగించుచు "నాయనా! ఏడ్చెద వెందులకోయీ!" యని ప్రశ్నించెను. బాలు డు పలుకడాయెను. మరల "మోహనా! చెప్పుము. నిన్నెవరేమనిరిబాబూ! నీకేమి

కావలెను? ఎందులకీయేడ్పు?" అని ప్రశ్నించెను. బాలుడు దుఃఖము నాపుకొన జాలక ద్విగుణీకృతశోకపీడితుడై ఎలుగెత్తి వెక్కి వెక్కి ఏడువసాగెను. తల్లి భరింపలేక పోయెను. బాలుని తొడపై నిడుకొని శిరమును తన హృదయమునకు జేర్చుకొని ఓదార్చుచు ఒక క్షణ మాగి మరల మరల ప్రశ్నింపసాగెను. ఎట్టకేలకు, జనని ప్రేమమయమృదూక్తులచేతను, లలితకరపల్లవసంస్పర్శనాదిసపర్యలచేతను దుఃఖమును కొంతవడి కుపశమిల్ల అవనమితవదనుడై "వారు నన్ను తమతో

నాడనీయక తఱిమి వైచిరి. "ఛీ" యని కసరి కొట్టిరి. దిక్కుమాలినవాడా పో పొమ్మనిరి" అని గద్గదకంఠుడై పలికి యొకతూరి తనదృక్కుల తల్లి వదనముపైబరపి, తిరుగతలక్రిందికి వంచుకొనెను. ఆదృక్కు లెంతటి భావగర్భితములో! పాప మాయువిదహృదయము భేదింపబడియెను. నయనము లశ్రుపూరితము లాయెను. ఒకటివెంట నొకటిగ బాష్పకణములు రాలసాగెను. హృదయమం దగ్గివెట్టి కలచినటు లుండెను. భావోన్మాదినియై మైమరచెను. ఉద్రేకమావహిల్ల పలుపోకల నూహింప గడంగెను. "నిజమే! తా పర్భాగ్యురాలే! దిక్కులేనిదిబాసియే! పతినెడబాసిసంపదలగోల్పోయి బందుగులచే నుపేక్షింపబడి నివసింప నిల్లులేక, ఎండవానల కోర్చి కుడువ గూటికిని, కట్టగుడ్డికును లేక దిక్కుమాలినదై క్షణము గడపుట దుస్సహముగతోచుచు అతిప్రయాసతో జీవయాత్ర సలుపుచున్నను తనమోహానునిగాంచి నంతనే ఎట్టికొరంతయును తలంపక అల్లారుముద్దుగ బెంచుకొనుచున్న యీపసికూన ఈ మానవప్రపంచమునకు వెగటాయెనా? పితృవిహీనుడే కానిమ్ము; పేదలలోనిరుపేదగానిమ్ము; పరిచారకులచేబరివేష్టితుడైయుండకపోనిమ్ము; "కాకిపిల్ల కాకికి ముద్దుగాదా?" అందును త్రిజగన్మోహనాకారుడును సార్థకనామధేయుడును నగు తన మోహానుడు లోకములో నందరి బిడ్డలవలె తానుగని యుండలేదా? తనబిడ్డకు మాస్వరూపిణియగు నీధరణిదేవతకు వెక్కసమగునా? సూర్యచంద్రులు సంపన్నుల గృహములందే ప్రకాశించుచు నిర్ధనులకు తమ కాంతుల ప్రసరింపకుందురా? సర్వదయాపరుడగు ఈశ్వరు డీపసికందును రక్తనేత్రాంచలుడై వీక్షించునా? ఆహా! దిక్కుమాలినవాడా? తన పెన్నిధి, తన ప్రేమంపుమొలక,

తనసర్వస్వము-ఎవడు దిక్కులేకున్నను, తన మేనబ్రాణములున్నంత దనుక ఆతనికి తానే దిక్కు; తనకాతడే దిక్కుకాదా!"

కొండొకతడ వాయమ నంటియున్న ప్రకృతియంతయును నిస్తేజము, నిర్వీర్యము, అచేతనము, నిశ్చలత్వము నందెను. అనంతమగు నిశ్శబ్ద మీవిశ్వమంతయు నావరించినట్లుండెను. ఆప్రశాంతవాతావరణమందు దుర్భరభావ పరంపరలచే తపియించు నా యతివహృదయ తాడనశబ్దము, బులుకుబులుకున నేత్రయుగ్మమునుండి వెల్వడు అశ్రుబిందువుల ధ్వనియు మాత్రమే శ్రవణేంద్రియములకు వినవయ్యెను. మోముమోమునశేర్చినపు డాతల్లి బిడ్డల యవలోకనములు ఒండొంటిలో లీనమై, కనుగెలంకులనుండి బయల్వడు కన్నీటి ధార లేకగతిని బ్రవహించి అనంతామృత వాహిని యయ్యెను.

3

ఆనాడు విజయదశమి. నగరలక్ష్మి సర్వాలంకార శోభితయై విలసిల్లుచుండెను. పట్టణమం దేవంకవీక్షించినను ఆనందదేవతకొలువు దీరియుండెను. విశాలములగు రాజబాట లన్నియుచిత్రవిచిత్రగతులనలంకరింపబడెను. గృహప్రాంగణములందెల్ల రంగవల్లికలుమ్రుగ్గులుకన్నులపండు వొనర్చుచుండెను. పండుగకై అత్తవారిండ్లకేతెంచిన క్రొత్తయల్లుండ్రను తృప్తిపరుపగోరి కలవారు కలిగినటులు భక్ష్యభోజ్యములతో విందులు చేయుచుండిరి. వీధిబడులందు జదువుబాలురు కోతులను విల్లంబులను జేబూని గుంపులుగుంపులుగ "అయ్యవారికి జాలు ఐదువరహాలు, పిల్లవాండ్రకుజాలు పప్పు బెల్లాలు" అని "జయవిజయీభవ" గీతములను బాడుచు నేగజొచ్చిరి. ఊరిలోనిపూజారులందరకు నాడు తలమున్కలుగ పని. పౌరోహితులకెల్ల మొలలోతు సంతర్పణలు; తులలేని సంభావనలు; ఎచటజూచినను నూతన వస్త్రధారులే. ఎచ్చోట నాలకించినను మంగళతూర్యనిస్వనంబులే. ఏవాడ జనినను సుమసౌరభపరిమళమే! ఆనందము; ఎల్లెడల నానందమే.

ఈ యానందసరోవరమున కావలిదరియందు మనశిథిలపటకుటీరము గలదు. విజయదశమిహర్షతరంగములు ఆకుటీరమును డాయజాల వాయెను. మోహనచంద్రునకు నాటి కైదవలంకణము. శరీరము చాల కృశించియుండెను. నేత్రములు పచ్చనై నిస్తేజము లాయెను. పెదవులు మధురిమను వీడెను. మొలనున్న గోగుమొలనూలు తుంటిక్రింది దిగజారి పోసాగెను. అట్టిస్థితియందున్న ప్రియసూనుని ఆయనాథవనిత కనురెప్పవలె గాపాడుచు పరిచర్య సలుపుచుండెను. ఐదుదినములనుండియు ఇరుగుపొరుగువారుచెప్పిన కూరగాయ వైద్యము లన్నియు జేసెను. "కాని కాలమందెట్టిప్రయత్నములును సానుకూలములు గావు." ధనాశాపిశాచము లగు అభినవడాక్టరులకు బోయుట కానిర్భాగ్యదేవతకు శక్తి లేదాయె. ఇక కర్తవ్యమేమి? వైద్యులలోకెల్ల వైద్యుడగు నాశ్రీహరియే పరమవైద్యుడు. ఔషధములలోకెల్ల నౌషధమగు ఆతని

పవిత్రనామస్మరణమే దివ్యౌషధము. ఏకాగ్ర చిత్తముతో శ్రీహరిని ధ్యానించెను. భజించెను. కీర్తించెను. కాని భగవానుడు ప్రసన్నుడాయెనా? ప్రపంచమం దెటనైన సర్వసాక్షిభూతు డనబరగు ఈశ్వరుడుగలడా? కలిగిన నాతడు దీనదయాపరు డనియు, లోకబాంధవు డనియు, సుజనజీవను డనియు, నుడివెడి నుడువులందు సత్యముగలదా? ఆయమ కదియెల్ల సంశయమై కన్పట్టె. డోలాందోళిత మనస్సు సత్యాన్వేషణమునకై పరితపించుచుండెను.

ఉన్నటులుండి ఆమె కర్ణపుటములకు "ఆతడు జీవింపగలడు" అను ధ్వనియొకటి జీవనసుధవలె సోకిన ట్లుండెను. కంటికగుపడని, మనసునకందని, యొక్క మహాశక్తి పరోక్షమునబల్కినఆమాటను విశ్వసించి తనమనోవాంఛ ఈడేరెగదాయని, తన కష్టములు గట్టెక్కినవిగదాయని,తన తనయుని కిక భీతిలేద నక్కరయే లేదని ముమ్మాటికి నమ్మెను.

కాని దుర్విధిని దప్పింప నేరితరము. చిమ్మచీకటియందు తళుకునమెరసిన మెరపు గాంచి వెలుగుగలిగెగదా యని సంతసించెను. కాని యీప్రకాశ మొకతృటికాలము మాత్రమే యని తెలియజాలక పోయెను. దారి డొంకలేక మలమలమాడు ఎడారియందుఎండమావులను గాంచి నీరని యాశించెను. కేవల భ్రమయని ఏరుగదోయెను.

"అమ్మా!" యనెను మోహనుడు.ఆతని ముద్దుపలుకులకు మంగళహారతి ముగిసెను. ఆతని చిన్నిపెదవులపై చిరునగ వంతరించెను.

౪

సాయంసమయమున రెండుమూడు గడియలు గడచెను. గంగాతీరమున శ్మశానవాటి కనతిదూరమందు కనుచూపుమేరను కొండొక శవమును మోసికొనివచ్చుచు ఏకాంతముగ బికారియై తిరుగుచున్న అనాథవనిత యొక్కపరుగున వారినిజేరెను.

"నాతనయుడు మోహనుడేవాడు. నా మోహనుని మీరేల మోయుదురు? నాబాలుని నన్నెత్తికొననిండు! నాతనయుని స్పృశింపకుడు! మీస్పర్శచే నాతని కోమలి

గాత్రము వసివాడును. నా మోహనచంద్రుని పరులచెంతనుండుట నేజూచిఓర్వలేను.చూడుడు. నన్నుగాంచి ఎంత దీనముగ విలపించుచున్నాడో!దిగవిడచిపొండు; నాతనయుని నా చంక నిడుకొందును!" అనెనుసీతసయు ఈలోకమునువీడెగదా?"యనిరిశవవాహకులు."లేదు, ముమ్మాటికి లేదు. నా కన్నుల మోసగింపగలరా మీరు? నా బాలుని నా కొసంగరా?" అనిమఱల నరచెను.సమాధానమిడకయేనారుతమదారినిబోయి" అయ్యో! నామొరాలకింపరేల? నామోహనుని నాకిడరేల" యని విలపించుచువారివెంటజనెను. కొంతదవ్వటులేగినిలచెను. ఆమెదృష్టి ముందున్న నది వైపు ప్రసరించెనుఆవికారిపకనకనొకతూరిన ప్పెను.

"అదుగో! అదుగో! చూచితిరా! మీ వలె భగవాను డసత్యము లాడడు; నా ముద్దులపట్టి నన్గాంచి చేయి ఊపుచున్నాడు! మోహనా నేనిదే వచ్చుచున్నాను....."

బ్రహ్మాండమగు భాగీరథీ స్రవంతియందొక స్త్రీకళేబరము గాన్పించెను. ఇట్టివాని నెన్నిటినో అనంతకాలవాహిని తన పొట్ట బెట్టుకొనుట గాంచినవా రేరీ!

సంపూర్ణము

సర్వజ్ఞమూర్తి

సీపిపి ఆంజనేయులు గారు

పలుమఱు మముఁ గష్టజలనిధిఁ ద్రోయుట, నీదయాగరిమ మన్నించుకొఱకె
ఏకాంతవాస మెంతేని గల్పించుట, నీశీలమహిమ వర్ణించుకొఱకె
భవపంక సాంద్ర లేపముఁ జక్కఁదొలఁచుట, నీశౌచవిధి గమనించుకొఱకె
ప్రళయకాలమున సర్వము దమియించుట, నీసత్య శిష్టి గణించుకొఱకె
ముక్తి జీవప్రపంచంబు ముదలఁగొనుచు, వలనెఱింగి దానిఁ గ్రమ్మఱ వదలుటెల్ల
మించు నీ ధర్మనియతి భావించుకొఱకె, రమ్యసంశుద్ధకీర్తి సర్వజ్ఞమూర్తి!